




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.

శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో

సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| గురువారం 28 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 360 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం


సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 28, ప్రతినిధి: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో తొలి విడతలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీలతో కలిసి బుధవారం నాంపల్లి, మలక్‌పేట్, బహదూర్‌పురా నియోజకవర్గాల్లో పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కుల్సుంపురా, అఫ్జల్ సాగర్ ప్రాంతాలతో పాటు కాలదేరా, గడ్డియన్నారం ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను అధికారులు పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని 24 నియోజకవర్గాల్లో పేదలకు ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని, తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.


File Photo

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 28, ప్రతినిధి: తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం, ఎత్తు అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయం కేటాయించి, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని కోరారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం ప్రతిపాదించబడిందని, మొదట 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాలని భావించగా 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని లేఖలో పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఉత్తర తెలంగాణ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ సరిపోదని నిపుణుల అభిప్రాయంతో తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేపట్టిందన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల సాగునీరు, తాగునీటి అవసరాల కోసం బ్యారేజ్ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్ పరిశీలించినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని, ఎఫ్ఆర్ఎల్ పెంపుతో గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని లేఖలో వివరించారు.

## కోహెడ మార్కెట్ శంకుస్థాపన ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 28, ప్రతినిధి: గౌరవ ముఖ్యమంత్రి చేత కోహెడ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం తెలంగాణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమం కోసం వివిధ శాఖల హెచ్‌వోడీలు, రాష్ట్ర స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వేదిక ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పార్కింగ్, భద్రత, విద్యుత్, పారిశుధ్యం తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.



## గ్రామీణ తెలంగాణకు హైస్పీడ్ ఇంటర్నెట్ లక్ష్యంగా అమెండెడ్ భారత్‌నెట్ అమలు వేగవంతం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 28, ప్రతినిధి: గ్రామీణ తెలంగాణకు నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి పలు కీలక అంశాలను తీసుకెళ్లారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన ఒప్పందాన్ని త్వరగా కుదుర్చుకోవడం, పెండింగ్ నిధులను విడుదల చేయడం వంటి అంశాలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర మంత్రితో చర్చించారు. మండలం నుంచి గ్రామపంచాయతీ వరకు రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం అవసరమని ముఖ్యమంత్రి కోరగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే తెలంగాణ ప్రభుత్వ దార్శనికతను ఈ సమావేశంలో వివరించారు. ప్రత్యేక స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా విస్తృత హైస్పీడ్ నెట్‌వర్క్ అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. టీ-ఫైబర్ నెట్‌వర్క్‌ను రింగ్ ఆర్కిటెక్చర్ రూపంలో విస్తరించడం ద్వారా ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గంలో సేవలు కొనసాగించే విధంగా ప్రణాళిక రూపొందించారు. తొలి దశలో ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో నెట్‌వర్క్ దెబ్బతిన్న 3,089 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరించనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ బ్రోచర్ విడుదల




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 28, ప్రతినిధి: హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ కోడ్ "ఎస్‌యూసీఈ" బ్రోచర్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో విడుదల చేశారు. తెలంగాణ ఎంసెట్ రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 22 ప్రభుత్వ, 157 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని, ప్రభుత్వ కాలేజీల్లో 8,532 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో లక్షా 18 వేల 542 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో తొలి ఏడాదిలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఈసీఈ, ఐటీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ఒక్కో విభాగానికి 60 సీట్ల చొప్పున మొత్తం 300 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. విద్యార్థులకు ప్రత్యేక హాస్టళ్లు, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, ఆధునిక ల్యాబ్‌లు, రవాణా సౌకర్యాలు, వర్క్‌షాపులు, ప్లేస్‌మెంట్ & కెరీర్ గైడెన్స్ వంటి సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లోనే కాలేజీ ఉండటం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమవుతుందని, ప్రభుత్వం 36 ఎకరాల భూమిని కేటాయించి భవనాలు, హాస్టల్ నిర్మాణానికి రూ.44.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఈ కళాశాల మైలురాయిగా నిలుస్తుందని, విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీని ఆప్షన్‌గా ఎంపిక చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో నర్సింగ్ విద్య బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 28, ప్రతినిధి: రాష్ట్రంలో నర్సింగ్ విద్యను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన నర్సింగ్ కౌన్సిల్ బలోపేతంపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి కీలక నిర్ణయాలు వెల్లడించారు. జీఎన్ఎమ్ విద్యార్థులకు కెరీర్ డెవలప్‌మెంట్ కోసం పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశ అవకాశాలు కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 10 బీఎస్సీ నర్సింగ్ కళాశాలలు, ఒక పీజీ ఎంఎస్సీ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నర్సింగ్ కళాశాలల్లో మిడ్ వైఫరీ కోర్సులను బలోపేతం చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రార్ పోస్టును సృష్టించనున్నట్లు వెల్లడించిన మంత్రి, నర్సింగ్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చే విద్యార్థులు, నర్సులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యుల్లత తదితర అధికారులు పాల్గొన్నారు.



## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం.. రైతులు అధైర్యపడవద్దు: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 28, ప్రతినిధి: వాతావరణ ప్రతికూల ప్రభావంతో జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు అధైర్యపడవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ భరోసా ఇచ్చారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించారు. కుల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, శంకరంపేట (ఎ) మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందని, సుమారు నాలుగు వేల క్వింటాళ్ల ధాన్యం తడిసినట్లు నివేదికలు అందాయని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 59,227 మంది రైతుల నుంచి 2,76,776.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 39,879 మంది రైతుల ఖాతాల్లో రూ.441.15 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 18 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తిచేసి ముగించామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచి ధాన్యం వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలని, హమాలీల సంఖ్య పెంచి లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టోకెన్ వారీగా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించి, ట్రక్ షీట్లు, రిజిస్టర్లు, ఓపీఎంఎస్ నమోదులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతి మిల్లుకు వెళ్లే వాహనాల వివరాలు, తేమ శాతం నమోదులు, గన్ని సంచుల లభ్యత, నిల్వల వివరాలు నిరంతరం నవీకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## జిల్లాలో ఘనంగా మహిళా భద్రత, రక్షణ వారోత్సవాలు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 28, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమాల నేపథ్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న మహిళా భద్రత, రక్షణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా ఉద్యోగులకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2013పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఇన్‌చార్జి జిల్లా మహిళా సంక్షేమ అధికారి స్వరూప జ్యోతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, సంస్కరణ చట్టం–2013 మహిళలకు రక్షణ కల్పించేందుకు రూపొందించబడిందని, మహిళా ఉద్యోగులు ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో మహిళలకు భయరహిత, గౌరవప్రద, సమాన వాతావరణం ఉండాలని, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు తప్పనిసరి అని తెలిపారు. లైంగిక వేధింపులు ఎదురైన మహిళలు మౌనం పాటించకుండా చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థలో అంతర్గత కమిటీ లేకపోతే లేదా ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేయాల్సి వస్తే భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ-బాక్స్ పోర్టల్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళల ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా, గోప్యంగా విచారణ జరుగుతుందని తెలిపారు. మహిళలపై వేధింపులను అరికట్టి కార్యాలయాలను సురక్షితంగా మార్చడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమన్నారు. ఇన్‌చార్జి డీడబ్ల్యూవో స్వరూప మాట్లాడుతూ మహిళల భద్రత, గౌరవం, స్వేచ్ఛ సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతి అని, మహిళలు సురక్షితంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, వివిధ శాఖల జిల్లా, మండల, గ్రామ స్థాయి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



## అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.. రైతులు పుకార్లు నమ్మొద్దు: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 28, ప్రతినిధి: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడకుండా పుకార్లను నమ్మి మధ్యవర్తులను ఆశ్రయించవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ మండలం తుల్జారంపేట్ గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించిన కలెక్టర్ తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కురిసిన అకాల వర్షాల వల్ల సుమారు 400 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు నివేదికలు అందాయని తెలిపారు. వరి ధాన్యం కింది భాగం నానిపోయిందని, దానిని ఆరబెట్టి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. సివిల్ సప్లై అధికారుల నివేదిక ప్రకారం ఇప్పటికే 250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించామని, మిగిలిన తడిసిన ధాన్యాన్ని కూడా ఈరోజు సాయంత్రం కల్లా తరలిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫేక్ కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగం.. టీచర్ సర్టిఫికెట్ రద్దు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 28, ప్రతినిధి: నకిలీ కుల ధృవీకరణ పత్రంతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన ఘటనలో సంబంధిత టీచర్‌కు జారీ చేసిన కుల ధృవీకరణ, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ–ఈ కేటగిరీ కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు రావడంతో ఉద్యోగం రాకపోయిన మరో అభ్యర్థి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టి సంబంధిత నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. విచారణలో పలు అక్రమాలు వెలుగులోకి రావడంతో సర్టిఫికెట్లను రద్దు చేస్తూ కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## ఏడుపాయల వన దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దంపతులు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 28, ప్రతినిధి: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానాన్ని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ తమ సతీమణితో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నానన్నారు. దేవస్థాన అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన చెందవద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 28, ప్రతినిధి: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని రైతులకు నష్టం కలగకుండా ఎంఎస్‌పీకి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి నిల్వలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైనన్ని వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచి లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, అవసరమైతే ఇసుక రవాణా లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని ఆదేశించారు. రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు భారీ స్థాయిలో జరుగుతున్నాయని, ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలను కొనుగోలు కేంద్రాలకు వెంటనే చేరవేసి టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షణ బలోపేతం చేసి కొనుగోళ్లు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ అదనపు లారీలను కేటాయించి ధాన్యం రవాణా ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారులు నిత్యానంద్, జగదీష్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి భారీ వర్షం.. పటాన్‌చెరులో జలమయం అయిన రహదారులు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 28, బి. డేవిడ్: పటాన్‌చెరు మండలంలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రాత్రి రెండు గంటల సమయంలో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా పటాన్‌చెరు ప్రధాన రహదారిపై మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో తీవ్ర ఎండల నుంచి ఉపశమనం లభించిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అయితే కోసిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమైందని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## తృటిలో తప్పిన ప్రమాదం.. ఈదురుగాలులకు కూలిన కరెంటు స్తంభం




సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 28, బి. డేవిడ్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు కరెంటు స్తంభం నేలకొరిగి తృటిలో ప్రమాదం తప్పింది. తల్లేరు కళ్లమ్మ ఇంటి ముందు విద్యుత్ స్తంభం ఒక్కసారిగా కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉండగా, వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే కరెంటు సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## డంపింగ్ యార్డును తలపిస్తున్న టెంపుల్ రోడ్డు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 28, ప్రతినిధి వి. సాయి: పటాన్‌చెరు నవపాన్ నాగులమ్మ గుడి మార్గంలో చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తున్న పరిస్థితి నెలకొంది. వ్యాపారులు చెత్తను తీసుకువచ్చి రోడ్డుపై వేస్తుండటంతో సమస్య తీవ్రరూపం దాల్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తరచూ చెత్తను తొలగిస్తున్నప్పటికీ మళ్లీ అదే ప్రాంతంలో చెత్త వేయడంతో సమస్య కొనసాగుతోందని పేర్కొన్నారు. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెత్తను అక్రమంగా వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కళ్లముందే నీటిపాలైన అన్నదాతల కష్టం



సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, మే 28: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్దఎత్తున ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు తీవ్ర నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన టార్పాలిన్లు, రక్షణ చర్యలు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా వడ్లపై పడిందని రైతులు ఆరోపించారు. ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యం ఇలా తడవడంతో భారీ నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన వడ్లను కూడా యథావిధిగా కొనుగోలు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## రంగంపేటలో రైతుల రాస్తారోకో



సందేశం టైమ్స్, కొల్చారం మండలం, మే 28: మెదక్ జిల్లా కుల్చారం మండలం రంగంపేటలో ధాన్యం కొనుగోలు సమస్యలపై రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. జోగిపేట్-మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని, రవాణా కోసం లారీలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవడంతో నష్టపోయామని వాపోయారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో దాదాపు గంటన్నర పాటు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## చెత్త వాహనాలు పట్టివేత.. రూ.40 వేల జరిమానా విధింపు




సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, మే 28: సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపల్ పరిధిలో అక్రమంగా చెత్త తరలిస్తున్న వాహనాలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా చెత్తను తరలిస్తున్న వాహనాలను గుర్తించిన అధికారులు వాటిని పట్టుకుని సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులకు మొత్తం రూ.40 వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన చెత్త వాహనాలను మున్సిపల్ కార్యాలయానికి తరలించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు.

## కొల్చారంలో తడిసి ముద్దయిన కొనుగోలు కేంద్రాలు



సందేశం టైమ్స్, కొల్చారం మండల ప్రతినిధి, మే 28: కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యం వర్షానికి తడవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

సందేశం టైమ్స్, కొల్చారం మండల ప్రతినిధి, మే 28: రంగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కేంద్రం మొత్తం నీటమునిగిన పరిస్థితి ఏర్పడింది. వర్షపు నీరు బయటకు వెళ్లేలా ముందస్తుగా కాలువ ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరిందని రైతులు ఆరోపించారు. దీంతో కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయే పరిస్థితి నెలకొంది. అనంతరం జేసీబీ సహాయంతో తాత్కాలిక కాలువ ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపించడంతో కొంత మేర సమస్య తగ్గినప్పటికీ శాశ్వత పరిష్కారం అవసరమని రైతులు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## బక్రీద్ అంటేనే దానధర్మాలకు ప్రతీక: మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 28, జిల్లా సమన్వయకర్త బి. సంగమేశ్వర్: జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ కార్యాలయంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని వివిధ గ్రామాలకు చెందిన మైనారిటీ సోదరీమణులకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగ దానధర్మాలకు ప్రతీక అని, మతం ఏదైనా మానవత్వం, దానగుణం గొప్పవని పేర్కొన్నారు. ప్రతి మతం తమకున్నదాంట్లో ఇతరులకు దానం చేయాలని బోధిస్తుందని, అన్ని గుణాల్లో దానగుణమే ఉత్తమమని తెలిపారు. ఆకలి అందరికీ సమానమని, పండుగ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు శక్తికొద్దీ సహాయం చేయడం ద్వారా కొంతమంది ఆకలిని తీర్చగలిగామని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన గ్రామాల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు పి.వి. భైరవన్ శర్మకు ఆహ్వానం



సందేశం టైమ్స్, రాజమండ్రి, మే 28, ప్రతినిధి: రాజమండ్రిలో జూన్ 6, 7 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు ప్రముఖ కవి, రచయిత, గాయకుడు పి.వి. భైరవన్ శర్మ కు ప్రత్యేక ఆహ్వానం అందింది. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా అత్యంత వైభవంగా నిర్వహించనున్న ఈ మహాసభల్లో వర్తమాన సాహిత్య కవితా రచన విభాగంలో పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానించారు. తెలుగు భాషా సాహిత్య సంపదను ప్రపంచస్థాయిలో చాటిచెప్పే అక్షర మహోత్సవంగా ఈ సభలు రూపుదిద్దుకుంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షురాలు జీ. ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రణాళికా అధికారి డా. టి. పార్థసారథి ఆహ్వానం మేరకు తాను పాల్గొంటున్నట్లు భైరవన్ శర్మ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “తెలుగు కేవలం ఒక భాష మాత్రమే కాదు, అది జాతి సంస్కృతికి చిరునామా, భావాలకు వెలుగునిచ్చే అక్షర దీప్తి” అని పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు వెలుగు మరింత విస్తృతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మహాసభల్లో నాలుగు వేలకుపైగా సాహిత్య, సాంస్కృతిక ప్రముఖులు పాల్గొననున్నారని, ఇది చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహోత్సవంగా అవతరించనుందని నిర్వాహకులు తెలిపారు.

## ఖరీఫ్ సీజన్‌కు జనుము విత్తనాల పంపిణీ ప్రారంభం



సందేశం టైమ్స్, రాయికోడ్, మే 28, అందోల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కే. మల్లేశం గౌడ్: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రాయికోడ్ ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం 2.20 ఎకరాలకు ఒక బ్యాగు చొప్పున గరిష్టంగా నాలుగు బ్యాగుల వరకు రైతులకు అందజేయనున్నారు. విత్తనాలు పొందేందుకు రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో ముందుగా పర్మిట్ తీసుకొని అనంతరం కేంద్రంలో విత్తనాలు పొందాలని సూచించారు. 40 కిలోల జనుము విత్తనాల బ్యాగు ధర రూ.3110గా నిర్ణయించగా ప్రస్తుతం 250 బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సారిక, వ్యవసాయ విస్తరణ అధికారులు శివ, నిఖిల్, అర్చన, ఆత్మ సిబ్బంది రమేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## జోగినాథ ఆలయం ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 28, ఇన్‌చార్జ్ కే. మల్లేశం గౌడ్: ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని మొదటి వార్డులో ఉన్న జోగినాథ ఆలయం ఆవరణలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. జాతరలు, ఇతర కార్యక్రమాల సమయంలో భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు, ఏఈ శ్రీకాంత్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో పబ్లిక్ టాయిలెట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో హృదయ విదారక ఘటన



సందేశం టైమ్స్, భద్రాచలం, మే 28, ప్రతినిధి: భద్రాచలం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన వెన్న కృష్ణ (42) అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వాలని ఆసుపత్రి సిబ్బందిని కోరినా స్పందించలేదని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ వాహనం ఏర్పాటు చేసుకోలేక కుటుంబ సభ్యులు మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ ఆసుపత్రి నుంచి తీసుకెళ్లడం స్థానికులను కలచివేసింది. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నూతన జిల్లా కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం



సందేశం టైమ్స్, అనంతగిరి మండలం, మే 28: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు పగిడి రామారావు, జల్ల అరుణలను మండల అధ్యక్షులు చింతకుంట్ల సతీష్ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన వారి సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డిలకు అనంతగిరి మండల కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాసరావు, పురుషోత్తం, ఉపాధ్యక్షులు వెంకటేష్ బాబు, నరసింహారావు, నరసింహారెడ్డి, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## SIRపై సమగ్ర విశ్లేషణ – BLA2 కార్యకర్తలకు దిశానిర్దేశం



సందేశం టైమ్స్, నడిగూడెం, మే 28: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో SIRపై సమగ్రంగా విశ్లేషించేందుకు, BLA2 కార్యకర్తలకు దిశానిర్దేశం ఇవ్వడానికి ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాసరావు, కోదాడ అసెంబ్లీ BLA-1 ఇన్‌చార్జి బొలిశెట్టి కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రజలతో మరింత సమన్వయం పెంపొందించడం, బూత్ స్థాయి కార్యాచరణను పటిష్టం చేయడం, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో BLA2 కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నడిగూడెం మండల అధ్యక్షులు బండారు వీరబాబు యాదవ్, ఉపాధ్యక్షులు మూల బిక్షం రెడ్డి, నూక పొంగు గురవయ్య, యువమోర్చా అధ్యక్షులు చినకేసి గోపాలకృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షులు దుస్సా గోపి, మండల కార్యదర్శి మొగల్లాని వీరన్న గౌడ్, సీనియర్ నాయకులు ముప్పా నరసింహారావు, బీరవెల్లి గోపాల్ రెడ్డి, బూత్ అధ్యక్షులు పోలంపల్లి శ్రీధర్, గుండుజు ఉపేందర్, మహిళా నాయకురాలు నూక పొంగు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పూర్తి చేయాలి – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 28: సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, గ్రీవెన్స్, భూభారతి సంబంధిత అన్ని పెండింగ్ దరఖాస్తులను 15 రోజులలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తాసిల్దార్లు, ఆర్డీవోలతో వెబ్‌ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. 15 రోజులలోగా పూర్తి చేసి సమగ్ర నివేదిక అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షాలతో తడిసినా ధాన్యం కొనుగోలు చేస్తాం రైతులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ భరోసా

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 28: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు భరోసా ఇచ్చారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రవాణా సమస్యల పరిష్కారానికి పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.బుధవారం కలెక్టర్, జిల్లా ఎస్పీ కే. నరసింహతో కలిసి ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలోని పివైఆర్ రైస్ మిల్లు, ఏపూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకాలు, కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. లారీల కొరత, హమాలీల సమస్యలు, అన్‌లోడింగ్ ఆలస్యం వంటి అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టామని తెలిపారు.ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌ను నియమించడంతో పాటు అదనపు హమాలీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాల నేపథ్యంలో అలర్ట్ మెకానిజం సిద్ధం చేశామని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు ఎటువంటి నష్టం జరగనివ్వమని భరోసా ఇచ్చారు.ఈ పర్యటనలో డిఆర్డిఓ సన్యాసయ్య, ఆత్మకూరు (ఎస్) తహసిల్దార్ హమీన్ సింగ్, ఎంపీడీవో అసీం అలీ, ఏవో దివ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఋతు శుభ్రతపై అవగాహన అత్యవసరం – డీఎంహెచ్‌వో డా. పెండెం వెంకట రమణ



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 28: సూర్యాపేట జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాల అమలు తీరును భాగంగా కాసరబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పెండెం వెంకట రమణ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఋతు శుభ్రత అవగాహన సదస్సులో "ఆరోగ్యకరమైన బహిష్టు శుభ్రత – ఆరోగ్యవంతమైన మహిళల భవిష్యత్తు" అనే నినాదంతో మహిళలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఋతుక్రమం ప్రతి మహిళ జీవితంలో సహజసిద్ధమైన శారీరక ప్రక్రియ అని, దీనిపై ఉన్న అపోహలు, భయాలు, మూఢనమ్మకాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బహిష్టు సమయంలో శుభ్రమైన శానిటరీ న్యాప్కిన్లు ఉపయోగించడం, వాటిని సమయానుకూలంగా మార్చడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు.ఆర్‌బీఎస్‌కే టీమ్స్, ఆరోగ్య సిబ్బంది ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతులు సంకోచం లేకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు మహిళల ఆరోగ్యంపై సానుకూల దృక్పథం కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ వైద్య అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.